ఈనాడు
నిర్మల్
బుధవారం అక్టోబరు 2, 2024

మహాత్ముని మాట.. వెలుగు బాట

● నేడు గాంధీ జయంతి

లక్షెట్టిపేట, దండేపల్లి న్యూస్‌టుడే

నూలు వడుకుతూ, మురికి వాడలు శుభ్రం చేస్తూ సామాన్యుల్లో సామాన్యుడిగా కలిసిపోయి భారత స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్మించిన అనితర సాధ్యుడు ఆయన. బ్రిటిషర్లతోనే కాదు, దేశంలోని సామాజిక రుగ్మతలపై సమకాలీన పోరాటాలు చేశారు గాంధీ. అలాంటి మహాత్ముడి అడుగుజాడలే మనకు దారి దీపాలు, బాపు మాటలే బంగారు బాటలు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన ఆశయాలను పునికిపుచ్చుకుని ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ సీమలపై 'న్యూస్‌టుడే' కథనం

మద్యపాన నిషేధం

స్వరాజ్య సాధనకు గాంధీజీ అహింసను ఆదర్శవంతమైన మార్గంగా ఎంచుకున్నారు. మద్యపానం అనేది ఉన్నత ఆశయ సాధనకు అడ్డంకి అని గ్రహించిన ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. మద్యం మత్తు సమాజాన్ని హింసా మార్గం వైపు నడిపిస్తుంది అని బలంగా నమ్మారాయన. కొన్ని గ్రామాలు స్వచ్ఛందంగా మద్య నిషేధం విధించుకుని ఆదర్శంగా నిలుస్తున్నాయి.


లింగదరి గూడెం గ్రామం

వీరు సాధించారు

నెన్నెల, బెల్లంపల్లి గ్రామీణం: బెల్లంపల్లి మండలం లింగదరిగూడెం గ్రామస్థులు గాంధీజీ ఆశయ సాధనలో మద్యం, మాంసాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ నివాసముండేది లింగదరి కోయలు. 60 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరు 60 సంవత్సరాలుగా మద్య, మాంసాలు ముట్టడం లేదు. ఊళ్లో పెంపుడు జంతువులను కూడా పెంచరు. ఎవరైనా చనిపోతే ఇంటి ఆవరణలోనే సమాధి చేయడం ఆనవాయితీ.

విద్య సమాజాన్ని జాతి, మత, కుల, వర్ణ వివక్షతలకు అతీతంగా దగ్గర చేస్తుంది. కొత్త రంగు, రూపాన్ని ఇచ్చి భవిష్యత్తుకు బంగరు బాటలు వేస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇంకా 7 లక్షల మంది వరకు నిరక్షరాస్యులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో వయోజనులే అధికంగా ఉన్నారు.


చందారంలో వయోజనులకు చదువు నేర్పుతున్న యువతి

చందారంలో అక్షర కాంతులు

లక్షెట్టిపేట మండలం చందారంలో నిరక్షరాస్యులైన వయోజనులకు వయోజన విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో వంద రోజుల పాటు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారు. శిక్షణ ఇచ్చిన యువతులు ఉచితంగా పొందిన కుట్టు శిక్షణ ద్వారా తమకు ఉపాధి మార్గాన్ని వెతుక్కోగలగడం విశేషం. విద్యావంతులైన గ్రామంలోని యువత సహకారంతో 65 మందికి అక్షర జ్ఞానం కల్పించారు.

జిల్లాలవారీగా అక్షరాస్యత శాతం ఇలా...

జిల్లా	శాతం
కుమురంభీం	59.72
ఆదిలాబాద్	65.46
మంచిర్యాల	66.37
నిర్మల్	69.09

"ప్రపంచంలో నీవు చూడాలనుకునే మార్పు మొదట నీ నుంచే ప్రారంభం కావాలి.

"శ్రమ నీ ఆయుధం అయితే గెలుపు నీకు బానిస అవుతుంది

"క్విట్ ఇండియా ఉద్యమంతో బాపూజీ దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించారు. క్లీన్ ఇండియా నినాదంతో దేశం మెరుగైన స్థితిలో నిలుస్తుందని ఆయన ఆనాడే భావించారు.

పారిశుద్ధ్యం

బాపూజీ కలల సాకారానికి అనుగుణంగా గ్రామస్వరాజ్య స్థాపన కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో చెత్త డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, తడిపొడి చెత్త వేరు చేసేందుకు వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. పచ్చదనం కోసం మొక్కల పెంపకం చేపట్టారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి బాటలు వేశారు.


దేవుని గూడెం గ్రామం


దేవుని గూడెంలో ఏర్పాటు చేసిన స్టీలు ప్లేట్లు, గ్లాసులు, డబ్బాలు

ప్రగతి పల్లె దేవుని గూడెం

జన్నారం మండలం దేవునిగూడ గ్రామం ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తింపు పొందింది. స్వచ్ఛతలో 98 శాతం, గుడ్ గవర్నెన్స్‌లో వంద శాతం మార్కులు సాధించింది. ప్రతి నెల క్రమం తప్పకుండా గ్రామసభలు నిర్వహించడం, జీపీ నిధుల నుంచి 750 బ్యాగులు కొనుగోలు చేసి ఇంటింటికి పంపిణీ చేయడం, స్టీల్ బ్యాంకు ఏర్పాటు ద్వారా గ్రామంలో జరిగే ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్ల వాడకం లేకుండా నియంత్రించగలిగారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త ద్వారా సంపద సృష్టి వైపు అడుగులు వేశారు.

"ఎంత గొప్పగా జీవించావో నీ చేతలు చెప్పాలి... ఎంత గొప్పగా మరణించావో సమాజం చెప్పాలి.

మంత్రులకు ఆహ్వాన పత్రికల అందజేత

ముథోల్(బాసర): బాసరలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ మంగళవారం బాసర ఆలయ ఈఓ విజయరామారావు, వైదిక బృంద సభ్యులు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కలను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

మున్సిపల్ డీఈగా హరిభువన్‌కుమార్

నిర్మల్: నిర్మల్ పురపాలక సంఘ డీఈగా హరిభువన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఈ జాదవ్ సంతోష్ భైంసా మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పుర ఛైర్మన్, కమిషనర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పండగ వేళ.. వేతనాల వేదన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:

తెలంగాణలో బతుకమ్మ, దసరా ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు, పిండివంటలతో వేడుకలు జరుపుతారు. ఇలాంటి పండగ సమయంలోనైనా వేతన బకాయిలు చెల్లిస్తారని ఎదురుచూస్తున్న ఒప్పంద కార్మికులు నిరాశకు లోనవుతున్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల మరమ్మతు, కార్యాలయంలోని వివిధ విభాగాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో మంగళవారం విధులు బహిష్కరించి నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.


కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆర్థిక ఇబ్బందుల్లో..

ఆయా విభాగాల్లో 338 మంది ఒప్పంద పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు జీతాల రూపంలో సుమారు రూ.47 లక్షలు చెల్లిస్తుంటారు. మూడు నెలలు కావొస్తున్నా వేతనాలు విడుదల కాలేదు. గతంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. గత నెల 26న సైతం విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. జిల్లా ఉన్నతాధికారులు వారిని ఒప్పించడంతో విధుల్లో చేరారు. ఆ సమయంలో జూన్ నెల వేతనాలు విడుదల చేశారు. అయితే జులై, ఆగస్టుతోపాటు సెప్టెంబరు నెల గడిచినా ఇప్పటి వరకు వాటి ఊసే లేకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరకుల దుకాణాల్లో అరువు పెరిగిపోయింది. డబ్బులు ఇవ్వనిదే సరకులు ఇవ్వలేమని దుకాణదారులు తేల్చి చెప్పడంతో అర్ధాకలితో పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

వ్యాధుల బారిన..

ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలుతున్నాయి. పలువురు కార్మికులతో పాటు కుటుంబ సభ్యులు వాటి బారినపడ్డారు. ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. తెలిసిన వారి దగ్గర వడ్డీకి డబ్బులు తీసుకుంటున్నారు. కొద్దిగా కోలుకున్న వారు నొప్పులతోనే పనులకు వస్తున్నారు. గైర్హాజరైతే జీతం సరిగ్గా రాదని, కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదురవుతాయన్న వేదనతో కష్టాల మధ్య పనులు చేస్తున్నారు. కార్మికులు విధులు బహిష్కరించడంతో చెత్త సేకరణ వాహనాలు మంగళవారం కార్యాలయానికే పరిమితమయ్యాయి. దీంతో పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లలో చెత్త పేరుకుపోయింది. పాలకులు, అధికారులు స్పందించి జీతాలు మంజూరు చేసి ఆర్థిక ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు.

బిల్లులు సిద్ధం చేస్తున్నాం:

సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కార్మికుల వేతన బకాయిలు చెల్లించడానికి ఇప్పటికే 225 మంది కార్మికుల బిల్లులు రూ.26 లక్షలు సిద్ధం చేశాం. మిగతా వారికి త్వరలోనే జమ చేయనున్నాం. అందరికీ అందించేలా తగిన ప్రణాళికలు రూపొందించాం. పన్నుల వసూళ్లు తగ్గడంతో ఆలస్యమవుతోంది. సాధ్యమైనంత త్వరగా వారికి అందజేసి సమస్యను పరిష్కరిస్తాం.

ధ్రువపత్రాలను పక్కాగా పరిశీలించాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 12 పరిశీలన బృందాల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. మొత్తం 342 ఖాళీలు భర్తీ కానున్నాయని వెల్లడించారు. అభ్యర్థుల అర్హతల నిజ ధ్రువపత్రాలను సరైన విధంగా విధివిధానాలకు అనుగుణంగా, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా అన్నింటినీ పరిశీలించాలన్నారు. పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, విద్యాశాఖ సూపరింటెండెంట్‌లు సురేందర్, వెంకటరమణ, సమన్వయకర్తలు రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, నర్సయ్య, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

అభ్యర్థులకు నిరాశ..

ధ్రువపత్రాల పరిశీలనకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినా అభ్యర్థుల జాబితా విడుదల కాకపోవడం, అభ్యర్థుల చరవాణి, మెయిల్‌లకు సందేశాలు అందలేదు. దీంతో తొలిరోజు మంగళవారం పరిశీలన నిలిచిపోయింది. అభ్యర్థులు నిరాశ చెందారు.

ఆరుగురు 'కడెం' ఏఈఈల బదిలీ

కడెం,న్యూస్‌టుడే: కడెం జలాశయం ఏఈఈలు ఆరుగురు రెండు రోజుల క్రితం బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లారు. వారిలో ప్రాజెక్టు ఇన్‌ఛార్జి ఏఈఈ రవినాయక్, ఉదయ్, సర్వరొద్దిన్, కుర్ల రాజు, శ్రీధర్, వీర అశ్విన్ ఉన్నారు. కాగా ఒక ఏఈఈ కడెంకు బదిలీపై వచ్చారు. మరో పది మంది ఏఈఈలను ప్రభుత్వం కడెం జలాశయానికి కొత్తగా కేటాయించింది. వారిలో నలుగురు విధుల్లో చేరారని ఈఈ విఠల్ తెలిపారు.

గడ్‌చందలో ఇల్లు దగ్ధం

లోకేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని గడ్‌చంద గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం డొంకేశ్వరం నర్సవ్వ ఇల్లు విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సవ్వ కుమారుడు మహేందర్ నిజామాబాద్ జిల్లా నందిపేటలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తారు. కుటుంబీకులు ఉదయం పనులు పూర్తి చేసుకుని తోటలోకి వెళ్లారు. ఎవరూ లేని సమయంలో ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అందరూ చేరుకునే లోపు నష్టం జరిగిపోయింది. ఇంట్లో దాచుకున్న రూ.1.80 లక్షల నగదు, మహేందర్ ధ్రువపత్రాలు, విద్యుత్తు ఉపకరణాలైన టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్‌మెషిన్, కూలర్, నిల్వ ఉంచిన కందులు, నువ్వులు, జొన్నలు కాలిబూడిదయ్యాయి. మండల రెవెన్యూ అధికారులు బాలకిషన్, దేవిక ఘటనా స్థలిని పరిశీలించి రూ.6.50 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు పైఅధికారులకు నివేదించారు.

డిజిటల్ కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహించండి


నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో డిజిటల్ కార్డుల అమలు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. డిజిటల్ కార్డుల సర్వేపై మంగళవారం హైదరాబాద్ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్టులపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా పాలనాధికారి అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు బృందాలుగా వెళ్లి ప్రతి ఇంటి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేలో భాగంగా ఇంటిలో ఉన్న ప్రతి కుటుంబ సభ్యుని వివరాలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఈసర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. జిల్లా అదనపు పాలనాధికారులు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

కలెక్టర్‌ను కలిసిన మహిళా కమిషన్ సభ్యురాలు

నిర్మల్: మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పూల మొక్క అందించి పరిచయం చేసుకున్నారు.

గుట్టపక్క ఊరు కనువిందు చేసే తీరు



చుట్టూ కాంక్రీటు కట్టడాల మధ్యన జీవించే వారికి కొండకోనల నడుమ ఉన్న గ్రామాలను చూస్తే మనసు నిండి పోతుంది. మామడ మండలం రాసిమెట్ల గ్రామానికి వెళ్తే ఇలాంటి అనుభూతే కలుగుతుంది. ఎత్తులో ఉన్న పచ్చని కొండ చెంతనే నివాసాలు, పక్కనే పంటచేలను చూస్తుంటే అక్కడే ఉండి పోవాలన్నట్లుగా ఉంటుంది.
–న్యూస్‌టుడే, మామడ

సమర్థంగా సేవలందించాలి : ఎస్పీ

నిర్మల్ పట్టణం: క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి ప్రజలకు సమర్థంగా సేవలు అందించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవాలని, పోలీస్ స్టేషన్, రికార్డుల నిర్వహణను పక్కాగా చేపట్టాలని సూచించారు. దుర్గామాత నవరాత్రుల నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆయా స్టేషన్లవారీగా పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు పురోగతి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మట్కా, గంజాయి, గుడుంబా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అడ్డుకోవాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటుచేయాలని చెప్పారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో ఉత్తమ సేవలందించిన పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు చేయరు.. అవస్థలు తీర్చరు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బంగల్‌పేట్ నుంచి బోయివాడకు వెళ్లేమార్గంలోని దుస్థితి ఇది. అలాగని అదేదో మురుగుకుంటనో, కందకమో కాదు. అచ్చంగా రోడ్డు. అదీ సీసీ రహదారి. అరె, అలా మురుగుతో నిండిందేంటి అని విస్తుపోతున్నారా! అదేనండి, మన మున్సిపల్ అధికారుల పనితీరుకు నిదర్శనం. గతంలో చేపట్టిన రహదారి విస్తరణ నేపథ్యంలో పాత రహదారిని తొలగించడంతో ఈ పరిస్థితి నెలకొంది. పలుచోట్ల పైప్‌లైన్‌లు దెబ్బతిన్నాయి. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఫలితంగా ఈ దృశ్యం నిత్యకృత్యంగా మారింది. ఉదయం మంచినీటి సరఫరా చేసిన సమయంలో పైప్‌లైన్ నీరంతా వృథాగా మారి ఇలా కుంటను తలపిస్తోంది. నీటి సరఫరా నిలిచిపోయిన తర్వాత కొంత సమయానికి పరిస్థితి ఎప్పటిలా మారుతుంది. వర్షం కురిసినా ఇలాగే తయారవుతుందని, దీనివల్ల ఆ మార్గంలో వెళ్లేవారు నానా అగచాట్లు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. పాదచారుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావని, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు వెళ్తున్న సమయంలో కాలుజారి పడుతున్న సందర్భాలు కోకొల్లలుగా ఉంటున్నాయని చెప్తున్నారు. అధికారులు, పాలకులకు విషయం తెలిసినా చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు.


రహదారిపై మురుగు ప్రవాహం..

మేమున్నాం.. మీకు తోడుగా... నిర్మల్ 97053 46693 భైంసా 63099 94649 ఖానాపూర్ 96401 62091

లీకేజీకి మరమ్మతులు

నర్సాపూర్(జి): బామ్ని గ్రామంలో మిషన్ భగీరథ నీటి పైపులు లీకేజీపై గత నెల 29న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ స్పందించారు. పైపు లైను లీకేజీలకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

స్పందన

గుంతలు పూడ్చారు



మన్నూర్-రాజూరా రహదారి గుంతల్లో కంకర పోసి వేయిస్తున్న మాజీ సర్పంచి ముత్తగౌడ్

లోకేశ్వరం, న్యూస్‌టుడే: మండలంలోని రహదారుల దుస్థితిపై 'ఈనాడు'లో గత నెల 30న 'రహదారుల మరమ్మతులకు మోక్షమెప్పుడో..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి రాజూరా మాజీ సర్పంచి ముత్తగౌడ్ స్పందించారు. ట్రాక్టర్ నుంచి దాదాపు రూ.20 వేల విలువ చేసే కంకర తెప్పించి రాజూరా నుంచి మన్నూర్ వరకు, రాజూరా నుంచి లోకేశ్వరం వరకు రెండు రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చించారు. దీంతో లోకేశ్వరం, మన్నూర్ వైపు వెళ్లే ప్రయాణికులకు తమ తిప్పలు కొద్దిమేరకైనా తప్పాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోండి

భైంసా గ్రామీణం: భైంసా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన గ్రామ పంచాయతీ సహాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బందికి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. నీటిసరఫరా, విద్యుత్తు మరమ్మతులు, ప్లంబింగ్, క్లోరినేషన్ తదితర అంశాలపై నాలుగు రోజులపాటు శిక్షణ అందిస్తున్నట్లు డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. డీఎల్పీవో సుదర్శన్, మిషన్ భగీరథ అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

ముధోల్: పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చించాల, ముధోల్ పంచాయతీని మంగళవారం పరిశీలించారు. చించాలలో మురుగు కాలువలను శుభ్రం చేయక పోవడం, ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో అక్కడి పంచాయతీ కార్యదర్శి అమితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం మురుగు కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. అనంతరం ముధోల్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి ప్రతి రోజు చేయించాలని, ఇంటి పన్నులు సైతం వసూలు చేయాలని ఈఓ ప్రసాద్‌గౌడ్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ శివకుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ నివారణ సామాజిక బాధ్యత

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: జీవకోటి మనుగడకు శత్రువుగా మారిన ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ, సాంగ్వి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన స్టీలు బ్యాంకు వస్తువులను దిలావర్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రదర్శించారు. శుభకార్యాలకు ప్లాస్టిక్ ప్లేట్లు కాకుండా స్టీలు పాత్రలను వాడాలని సూచించారు. ఎంపీవో గోవర్ధన్, ఉపాధిహామీ ఏపీవో ప్రియ, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త అంశాలపై అవగాహన పెంచుకోవాలి



మామడలో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

మామడ, న్యూస్‌టుడే: నీటి సరఫరా, నాణ్యత వంటి విషయాలపై గ్రామపంచాయతీ సహాయకులు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మామడలో మంగళవారం నిర్వహించిన రెండు మండలాల మిషన్ భగీరథ నీటి సహాయకుల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలతో వృత్తిలో మరింత నైపుణ్యం పొందాలన్నారు. మామడ, లక్ష్మణచాంద మండలాల ఎంపీడీవోలు రాధ, గంగాసాగర్ రెడ్డి, ఏఈ ప్రశాంత్‌కుమార్, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నిర్మల్ అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి మాట్లాడారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, నాయకులు పద్మకుమారి, రమాదేవి, రాణి, దయాసాగరి, వనమాల పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



అడెల్లిలో ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న సీఐ రామకృష్ణ

సారంగాపూర్, న్యూస్‌టుడే: అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద ఈ నెల 5, 6 తేదీల్లో జరుగనున్న గంగనీళ్ల జాతర ఏర్పాట్లను మంగళవారం నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ పరిశీలించారు. ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆభరణాలు గోదావరికి బయలు దేరే సమయం, రూట్‌మ్యాప్ వివరాలపై ఆలయ ఈవో రమేష్‌తో చర్చించారు. భక్తులు ఉండే స్థలాలు, వాహనాలు నిలిపే చోటు, ఆర్టీసీ బస్సులు ఆపే స్థలాలను గుర్తించారు. ఆయన వెంట సారంగాపూర్, దిలావర్‌పూర్, నిర్మల్ గ్రామీణ ఎస్సైలు శ్రీకాంత్, సందీప్, లింబాద్రి, పీఎస్సైలు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాత్కాలిక అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముధోల్: ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం తాత్కాలిక అధ్యాపకుడిగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బుచ్చయ్య ఒక ప్రకటనలో కోరారు. 3వతేదీ వరకు భైంసా డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేయాలన్నారు.

తెలంగాణ సంప్రదాయం.. బతుకమ్మ సంబరం



నిర్మల్: కోలాటమాడుతూ పాటలు పాడుతున్న ఉపాధ్యాయులు, చిన్నారులు



నిర్మల్ అర్బన్ : బతుకమ్మకు హారతి ఇస్తున్న వశిష్ట పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు



మామడ: పొన్కల్ ప్రాథమిక పాఠశాలలో..



కుభీరు: మాలేగాం పాఠశాలలో..

దసరా సెలవులు ప్రకటించడంతో పలు విద్యా సంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అందరూ కలిసి తీరొక్క పూలతో బతుకమ్మలను తీర్చిదిద్దారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి నృత్యాలు, చప్పట్లు, కోలాటాలతో సందడి చేశారు. - న్యూస్‌టుడే బృందం



నిర్మల్ మండలం అనంతపేట్ ప్రాథమిక పాఠశాలలో..



బతుకమ్మతో గడ్‌చంద ఉన్నత పాఠశాల విద్యార్థిని



కడెంలో..



కుంటాల: ఆదర్శ పాఠశాలలో..



నర్సాపూర్(జి): తిమ్మాపూర్(జి) ప్రాథమిక పాఠశాలలో.



భైంసా: వాలేగాంలో..



దస్తురాబాద్: బుట్టాపూర్ యూపీఎస్‌లో..



సోన్: కడ్తాల్‌లో..



గజేందర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ ప్రకాష్, తోటి ఉపాధ్యాయులు

గురుకుల ఉపాధ్యాయుడికి డీఎస్సీలో ప్రథమ ర్యాంకు

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మండలం చించోలి(బి)లోని మైనార్టీ బాలుర గురుకుల విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జెడ్ల గజేందర్ సోమవారం విడుదలైన ఆదిలాబాద్ జిల్లా డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు.. స్కూల్ అసిస్టెంట్ విభాగం గణిత శాస్త్రంలో ఓపెన్ కేటగిరిలో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. మంగళవారం ఆయనను ప్రిన్సిపల్ ప్రకాష్, అధ్యాపకులు, తోటి ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

కొలువులు సాధించడంపై హర్షం

నిర్మల్ అర్బన్: డీఎస్సీ ఫలితాల్లో డాక్టర్ అప్పాల కావేరి గ్రంథాలయంలో శిక్షణ పొందిన పది మంది అభ్యర్థులు ఎంపిక కావడం హర్షణీయమని ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

రైతు దీక్షలో నిర్మల్ భాజపా నాయకుల సంఘీభావం

నిర్మల్: రైతుల హామీల సాధనకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భాజపా శాసనసభా పక్ష నేత, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన 24 గంటల రైతు దీక్షకు మంగళవారం ఉదయం నిర్మల్ భాజపా నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా మభ్యమాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, నాయకులు జమాల్, మధు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కల్యాణి, నిర్వాహక కార్యదర్శి గస్కంటి గంగాధర్ తెలిపారు. గత నెల 14, 15, 16 తేదీల్లో నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్ర టోర్నీలో జూనియర్స్ విభాగంలో పట్టణానికి చెందిన బి.శశాంక్, సారంగాపూర్ మండలం జామ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని జి.మమత, సోఫినగర్ కేజీబీవీ క్రీడాకారిణి మల్లేశ్వరి ఉత్తమ ప్రతిభ కనబర్చారని వెల్లడించారు. పంజాబ్‌లో బుధవారం నుంచి చేపట్టబోయే టోర్నీలో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

కుంటాల: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్సై సీహెచ్.భాస్కరచారి అన్నారు. నిర్మల్ పట్టణంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో కుంటాల విజయసాయి పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎస్సై వారందరిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపల్ స్వప్న, కరాటే శిక్షకుడు గజేందర్, పీఈటీ అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాగతోత్సవం

నిర్మల్ పట్టణం: విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని వక్తలు అన్నారు. స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మంగళవారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఏసీటీఓ రాజశేఖర్, ప్రిన్సిపల్ డా.అఖిలేశ్‌కుమార్‌సింగ్, వైస్ ప్రిన్సిపల్ శశిధర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు కొలువుల్లో 'సృజన'



మూడు కొలువులు సాధించిన సృజన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో సర్కారు కొలువు సాధించడం అంత తేలిక కాదు. అలాంటిది వరుసగా మూడు సర్కారు కొలువులు సాధించి ఘనత చాటారు నిర్మల్ పట్టణానికి చెందిన గంద్రత్ సృజన. బంగల్‌పేట్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గంద్రత్ కిషన్ కూతురైన సృజన ఎమ్మెస్సీ, బీఎడ్ పూర్తి చేసి పలు పోటీ పరీక్షలు రాశారు. మొదట జూనియర్ పంచాయతీ కార్యదర్శి పరీక్షలో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చి దానిని పొందారు. అనంతరం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్ట్ పరీక్షలోనూ టాపర్‌గా నిలిచి ఉద్యోగాన్ని దక్కించుకుని ప్రస్తుతం ఖానాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఒక పక్క విధి నిర్వహణతోపాటు డీఎస్సీకి సిద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్‌లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచి మరోసారి తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు.

వయోవృద్ధులను గౌరవించాలి



వృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, వయోవృద్ధులను గౌరవించి ప్రేమ, ఆప్యాయతలతో చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ, విద్యాంగుల వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వృద్ధులకు నష్టం, అన్యాయం జరిగినా నిరాదరణకు గురైనా అధికారులను లేదా టోల్‌ఫ్రీ నెంబరు 14567 సంప్రదించాలన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి స్థిర, చర, రక్షణ తదితర సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వృద్ధులకు వారి హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా వయోవృద్ధులను సన్మానించి ఆట, ఉపయోగకర వస్తువులు అందజేశారు. అంతకు ముందు ఎన్టీఆర్ మినీ స్టేడియం మైదానం నుంచి పింఛనర్ల సంఘ భవనం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జాతీయ కార్యదర్శి ఎం.సి.లింగన్న, సీడీపీవోలు, విశ్రాంత ఉద్యోగులు, సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మతమార్పిడికి యత్నించిన ఇద్దరికి జైలు

కడెం, న్యూస్‌టుడే: కడెం రామాలయం పూజారిని చర్చికి తీసుకెళ్లి మతమార్పిడి చేసేందుకు యత్నించారనే కేసులో కడెంకు చెందిన ఇద్దరికి న్యాయస్థానం ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామాలయం పూజారిగా పనిచేసిన నవీన్‌శర్మను 2015లో కడెంకు చెందిన ఎ.కరుణాకర్, మల్లేపల్లి గంగారాం పుట్టినరోజు వేడుకలకు ఆహ్వానించారు. మున్యాల్ చర్చికి తీసుకెళ్లి ప్రార్థనలు చేస్తూ శాలువాలు కప్పి మత మార్పిడికి యత్నించారని పూజారి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఖానాపూర్ న్యాయమూర్తి నిందితులకు ఒక రోజు జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించారని, మంగళవారం వీరు జైలుకు వెళ్లారని ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు చోరీ

సోన్: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లిన ఘటన మంగళవారం సోన్‌లో చోటుచేసుకుంది. సోన్ ఏఎస్సై భీమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోన్‌కు చెందిన పెల్లి లసుంబాయి మధ్యాహ్నం తన ఇంటి ముందు మంచంపై కూర్చున్నారు. గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఇంటిముందు ఆగాడు. చిరునామా అడుగుతూ దగ్గరకు వచ్చి ఆమె మెడలో నుంచి బంగారు పూసల గొలుసును తెంపుకొని వెళ్లాడు. దాని విలువ సుమారు రూ.25 వేలు ఉంటుంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై వివరించారు.



కుంటాల: అందకూర్‌లో సోయా కుప్పపై కప్పిన టార్పాలిన్ కవరు



భైంసా: తిమ్మాపూర్‌లో కల్లంలో నిలిచిన వర్షపు నీటిని చూసి ఆందోళన చెందుతున్న రైతులు

భారీ వర్షం.. కర్షకులకు కష్టం

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో వారం రోజులుగా సోయా నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. అయితే వర్షాలు మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దీంతో రైతులు పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు పరుగులు తీస్తున్నారు. పలు గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురియగా సోయా కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పేందుకు రైతులు అవస్థలు పడ్డారు. వర్షాలు లేకపోతే పత్తితీత, సోయా, మినుము, తదితర పంట ఉత్పత్తులను సకాలంలో ఇంటికి తెచ్చుకునేందుకు వీలుపడుతుంది. వర్షంతో పత్తితీత పనులకు ఆటంకం కలుగుతుండటంతో నిలువునా తడిసి ముద్దవుతోందని రైతులు వాపోతున్నారు.

భైంసా గ్రామీణం: మండలంలోని తిమ్మాపూర్, వానల్‌పాడ్, మాటేగాం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కల్లాల్లోని పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. సోయా నూర్పిడి పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోత దశలోని సోయా పంట దెబ్బతింది. పత్తి పంటకు సైతం నష్టం వాటిల్లింది. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కర్షకులు వాపోయారు.

కార్యవర్గం ఎన్నిక

దిలావర్‌పూర్: పీఆర్టీయూటీఎస్ మండల కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా యాదసాయన్న, ప్రధాన కార్యదర్శిగా పద్మనాభం, మహిళా కార్యదర్శిగా లావణ్య ఎన్నికయ్యారు. సంఘం నాయకులు గంగాధర రావు, నర్సయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: పీఆర్టీయూ టీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుపుల బాలకృష్ణ, ప్రధానకార్యదర్శిగా పులిండ్ల సురేష్, కోశాధికారిగా బొర్ర చంద్రయ్య, మహిళా కార్యదర్శిగా జి.స్వప్న ఎన్నికయ్యారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, చక్రాల హరిప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కార్యక్రమంలో సంఘ నాయకులు గంగాధర్‌రావు, ఎ.నర్సయ్య, ఒడ్నాల రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శులుగా..

నిర్మల్ అర్బన్: పీఆర్టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శులుగా ముగ్గురిని నియమించామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, చక్రాల హరిప్రసాద్ తెలిపారు. నాకిడి గంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, మేడారం ప్రశాంత్‌ను నియమిస్తూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమాకర్‌రెడ్డి, పర్వతి సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

వీడీసీ..

పెంబి: మండలంలోని ఇటిక్యాల గ్రామ వీడీసీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దెల మహేందర్, ఉపాధ్యక్షుడిగా సుంచు నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మీర్జాసమీబేగ్, కోశాధికారిగా పటేల్ గణేశ్ ఎన్నికయ్యారు.

నియామకం

కుభీరు: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు భాజపా కుభీరు మండల ఇన్‌ఛార్జిగా బోయిడి అభిషేక్‌ను నియమిస్తూ మంగళవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు

బాసర ఆలయంలో అక్రమాలంటూ ఫిర్యాదు

ముథోల్(బాసర): బాసర ఆలయంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ విజిలెన్స్ కమిషనర్‌కు బాసర నాయకులు సాంబ్లి రమేష్, మాజీ సర్పంచి రమేష్ ఫిర్యాదు చేశారు. ఈఓ, ఏఈఓ అందిన కాడికి దోచుకుంటున్నారని, ఏదైనా చెక్ రాయడానికి సైతం డబ్బు తీసుకున్న తర్వాతే ఇస్తున్నారని ఆరోపించారు. కొందరు ఉద్యోగులకు అర్హత లేకున్నా విభాగాలను అప్పగించి వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి ఉపాధిహామీ గ్రామసభలు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పథకం పనుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ గట్టుపల్లి నవీన్ తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా మొత్తం ప్రక్రియ నవంబరు 30 వరకు కొనసాగుతుందన్నారు.

విద్యుత్తు సమస్య తలెత్తకుండా చర్యలు

ఖానాపూర్: పట్టణంలో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట విద్యుత్తు నియంత్రికల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం, ఏఈ రాంసింగ్ చెప్పారు. ఇంద్రనగర్, కరీంకాలనీ, పద్మావతినగర్ కాలనీలలో నియంత్రికల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.

ధ్వజారోహణం

నిర్మల్: పట్టణంలోని ప్రియదర్శినినగర్ ప్రాంతంలో ఉన్న సద్గురు పూలాజీబాబా ధ్యాన కేంద్రం 23వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ గంద్రత్ ఈశ్వర్-కమల దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం సహాయనిధికి విరాళం

ఖానాపూర్ గ్రామీణం: మస్కాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులు రూ.9720 నగదు పోగు చేశారు. ఈ విరాళాన్ని మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ రావు చేతుల మీదుగా పంపించారు.

విద్యుత్తు ఉపకేంద్రం సందర్శన

ముథోల్(బాసర): బాసర ఆర్జీయూకేటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు మంగళవారం బాసరలోని విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శించారు. అందులోని పరికరాలను, విద్యుత్తు సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఏడీఈ లక్ష్మణ్, విశ్వవిద్యాలయం పరిపాలన విభాగం అధికారి రణధీర్, తదితరులు పాల్గొన్నారు.

సామిల్‌లో తనిఖీలు

ఖానాపూర్: పట్టణంలోని కలపకోత మిల్లుల్లో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్వో రమాదేవి ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినగర్, ఇంద్రనగర్ సామిల్‌లను తనిఖీ చేశారు. కలపకోత వివరాలను, క్రయవిక్రయాల దస్త్రాలను పరిశీలించారు.

రక్తదాన శిబిరం

నిర్మల్ గ్రామీణం: మండలంలోని రత్నాపూర్‌కాండ్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంకు యాజమాన్యం స్థానిక కావేరి రక్త నిల్వ కేంద్రం సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించింది. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 300 ప్లేట్లు అందజేశారు. పెట్రోల్ బంకు యజమాని యూసుఫ్ అహ్మద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రథాలగుడిలో రుద్రాభిషేకం

నిర్మల్ పట్టణం: బ్రహ్మపురి రథాలగుడిలో స్వయంభు శివలింగానికి మంగళవారం రుద్రాభిషేకం జరిపారు. ప్రతీనెల అమావాస్యకు ముందు రోజు ఆలయంలో అభిషేకం ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. అన్నప్రసాద వితరణ చేశారు. గుడి ఉమామహేశ్వరశర్మ, గుడి రాజేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, చంద్రశేఖరశర్మ, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

నిర్మల్ అర్బన్: విశ్రాంత ఎంపీడీవో చట్ల గజ్జారాం రచించిన 'కిషోర గాంధీయం' పుస్తకాన్ని నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక, కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రియదర్శినినగర్‌లోని లయన్స్ క్లబ్‌లో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు తొడిశెట్టి పరమేశ్వర్, నేరెళ్ల హన్మంతు తెలిపారు.

నీటి సమస్య లేకుండా చూడండి

సారంగాపూర్: మండలంలోని ధని గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచారకమిటీ సభ్యుడు రామగిరి రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఏఈవోల నిరసన



నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వర్తిస్తున్న ఏఈవోలు


మామడ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే విధులు తమకు భారమవుతాయని నిరసిస్తూ మండల ఏఈవోలు మంగళవారం మామడలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. గ్రామస్థాయిలో తమకు సహాయకులను నియమించిన తర్వాతే సర్వే ప్రక్రియ మొదలు పెట్టాలని అన్నారు.

రాయితీ పత్రాలు అందజేత

దస్తురాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా రాయితీ సిలిండర్ లబ్ధికి ఎంపికైన మహిళలకు మండలంలోని భూత్కూర్‌లో మంగళవారం అధికారులు, నాయకులు ధ్రువపత్రాలు అందజేశారు.

పూల పండగ.. సంస్కృతి నిండుగా..

● నేటి నుంచి బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో మహిళలు

న్యూస్‌టుడే, తలమడుగు :

సంస్కృతి సంప్రదాయాలకు పెట్టింది పేరు బతుకమ్మ పండగ. రోజుకో ప్రత్యేకతతో.. తీరొక్క పూలతో.. ఆకట్టుకునే ఆటపాటలతో మహిళలంతా కలిసి కట్టుగా నిర్వహించుకుంటారు. పుట్టింటి నుంచి మెట్టినింటికి ఆడ బిడ్డలు చేరుకుని గౌరమ్మను కొలుస్తారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పండగ ఎంగిలి పూలతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ఇది మహాలయ అమావాస్య రోజు(బుధవారం) ప్రారంభమవుతుంది. 'శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమై తోచునమ్మా గౌరమ్మ.. భారతీ సతివయ్యి బ్రహ్మకిల్లాలివై' అంటూ మహిళలు ఆటపాటలతో అలరిస్తారు. బతుకమ్మను ఆదిశక్తి స్వరూపిణిగా మహిళా లోకం వేడుకుంటోంది. ఆధ్యాత్మికతను చాటి చెబుతోంది.

ఆదిలాబాద్‌లో మాత్రం విభిన్నం

ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లాలో గతం నుంచి భిన్న సంస్కృతి ఉంది. ఇది మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఇతర జిల్లాలకు భిన్నంగా పండగను నిర్వహిస్తారు. నిర్మల్, మంచిర్యాల జిల్లాలో ప్రధాన కూడళ్లలో చిన్న గుంత తవ్వి దాని చుట్టూ గద్దెలు కట్టి వాటిపై బొడ్డెమ్మలను పేర్చి తొమ్మిది రోజుల పాటు పాటలు పాడుతూ ఆడుకుంటారు. అనంతరం దసరా కంటే ముందుగా లేదా దసరా మరుసటి రోజున ఊరి మహిళలందరూ కలిసి రకరకాల పూలతో బొడ్డెమ్మలను పేర్చి వేడుకలకు ముగింపు పలుకుతారు. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం దసరా పండగ ముగిసిన పక్షం రోజుల్లో వీలునుబట్టి చివరి రోజును నిర్ణయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలంతా అధిక సంఖ్యలో హాజరై ఆనందోత్సాహాల నడుమ వేడుకలను ముగిస్తారు.

పుట్టింటి నుంచి మెట్టినింటికి..

జిల్లాలో బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయంటే చాలు పెళ్లి చేసుకున్న మహిళలంతా తమ పిల్లాపాపలతో కలిసి పుట్టినింటికి చేరుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. అయితే జిల్లాలో ఏ పండగ వచ్చినా మెట్టినింటికే ప్రాధాన్యమిస్తారు. కాగా నెలరోజుల పాటు పండగ జరుగుతుండటంతో పుట్టింటికి చేరుకొని అక్కడే కొద్దిరోజులు ఉండి తనివితీరా తమ చిన్ననాటి స్నేహితురాళ్లతో ఆడిపాడతారు.

బావి తవ్వి పువ్వులు పేర్చి

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో విశాల ఆవరణ కలిగిన ఇంటి ఎదుట ఓ పెద్ద గుంత తవ్వుతారు. అందులో నుంచి తీసిన మట్టితో చుట్టూ గద్దెలను పేర్చుతారు. అందులో గంగా గౌరీల పేరిట ఎదురెదురుగా రెండు పెద్ద గద్దెలను, మిగిలినవి అవసరం మేరకు గద్దెలను తయారు చేసుకుంటారు. సంబరాల తొలి రోజున బాజాభజంత్రీల నడుమ యెంపల్ల చెట్టును గ్రామ శివారు ప్రాంతంలోని ఓ పొలం నుంచి తీసుకొచ్చిన గుంతలో నాటుతారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గద్దెలపై చిన్నపాటి బతుకమ్మలను పేర్చడం, రాత్రి సమయంలో అందరూ ఆటపాటల్లో పాల్గొంటారు. దసరా పండగ రోజు మాత్రం చిన్న సద్దుల బతుకమ్మగా భావిస్తారు. ఆ రోజు బతుకమ్మలను అందంగా తయారు చేసి గద్దెలపై పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు. ఇంటిల్లిపాది ఆనందంగా అక్కడే పాల్గొంటారు. ప్రతి బతుకమ్మ వద్ద రోజుకో ప్రత్యేకత ఉంటుంది. గ్రామ పెద్దల నిర్ణయం మేరకు తమకు వీలైన మంచి రోజు చూసుకుని పెద్ద సద్దుల పండగ పేరిట ముగిస్తారు. ఆ రోజు మాత్రం రాత్రి పూట పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి డప్పువాయిద్యాల నడుమ పాటలు పాడుతూ గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. తర్వాత నిమజ్జనం చేస్తారు.



మృత్యు ఘడియ

● వాహనం అదుపుతప్పి ఒకే కుటుంబంలో అయిదుగురి దుర్మరణం

ఈటీవీ - ఆదిలాబాద్ : న్యూస్‌టుడే - ఆదిలాబాద్ నేర విభాగం

కన్ను తెరిస్తే జననం. కన్నుమూస్తే మరణం. రెప్పపాటు సమయంలో ఏం జరుగుతుందో తెలియని జీవితం. అలాంటి ఘటనే సోమవారం అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురిని మృత్యువు కబళించింది. మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా.. జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకొని జీవితాలు తలకిందులయ్యాయి.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఆదిలాబాద్ పట్టణం టీచర్స్‌కాలనీకి చెందిన సయ్యద్ అఫ్రీన్(36) - మహ్మద్ మొహినొద్దీన్(43) దంపతుల కొడుకు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్(14) హైదరాబాద్‌లోని మహదుల్ అబ్రార్ మదర్సాలో ధార్మిక విద్యను అభ్యసిస్తున్నాడు. అర్ధ సంవత్సర పరీక్షలు ముగియడంతో మదర్సా సోమవారం నుంచి సెలవులు ప్రకటించింది. మహ్మద్ ఫరీద్ ఉద్దీన్‌ను ఇంటికి తీసుకొచ్చేందుకు తల్లి సయ్యద్ అఫ్రీన్ భర్త మహ్మద్ మొహినొద్దీన్, కూతురు ఇస్రాఫాతిమా(4), మరో ఇద్దరు కొడుకులు సాజ్ ఉద్దీన్(13), ఉస్మాన్‌ఉద్దీన్(8)తోపాటు తండ్రి సయ్యద్ మొహిజొద్దీన్(67), అన్న కొడుకు సయ్యద్ మహ్మద్ అలీ(5)తో కలిసి సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ నుంచి ఇన్నోవా వాహనంలో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ ఫరీద్‌ఉద్దీన్‌ను తీసుకొని ఆదిలాబాద్‌కు తిరుగు ముఖం పట్టారు. అర్ధరాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఆదిలాబాద్‌కు 15 కి.మీ. దూరంలో ఉన్న మేకల గండి దగ్గర వాహనం రహదారి పక్కన ఉండే రక్షణ పిల్లర్లను ఢీకొట్టుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న సిమెంటు నాలాలో పడిపోవటంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.



మొహమ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్



సయ్యద్ మహ్మద్ అలీ



ఫరీదుద్దీన్



మొహినొద్దీన్



సయ్యద్ మొహిజొద్దీన్

మృతులు వీరే..

క్షణకాలంలో జరిగిన ఘటనలో చిన్నారులు మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా పెద్దాయన సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్ చనిపోయారు. మదర్సా నుంచి ఇంటికి వస్తున్న మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. క్షణాల్లో జరిగిన ఈ ఘటన సయ్యద్ మొహినొద్దీన్ కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగిల్చగా.. జిల్లాలో దిగ్భ్రాంతిని కలిగించింది.

భర్త పిల్లలేరీ?

తీవ్రంగా గాయపడిన సయ్యద్ అఫ్రీన్ పరిస్థితి దయనీయంగా మారింది. భర్త మహ్మద్ మొహినొద్దీన్, తండ్రి సయ్యద్ మొహిజొద్దీన్, కొడుకులు మహ్మద్ ఫరీద్ ఉద్దీన్, మహ్మద్ ఉస్మాన్‌ఉద్దీన్, అన్న కొడుకు మహ్మద్ అలీ చనిపోయారని తెలిసి ఆమె దుఃఖంతో తల్లడిల్లింది. ఊహించని ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి బేల చూపులు చూస్తున్న కూతురు ఇస్రా ఫాతిమా, కొడుకు సాజ్ ఉద్దీన్‌ల దయనీయస్థితి అందరిని కంటతడి పెట్టించింది. భారీగా తరలివచ్చిన బంధువుల అశ్రునయనాల మధ్య మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్‌లోని ఈద్గా ఖబ్రస్థాన్‌లో అంత్యక్రియలు ముగిశాయి.

కాల్‌టెక్స్ కష్టాలు



బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కాల్‌టెక్స్ ప్రాంతం పరిస్థితి ఘోరంగా ఉంది. మంచిర్యాలకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను నెలల తరబడిగా శుభ్రం చేయకపోవటంతో దుర్గంధం వ్యాపించి వ్యాధులకు కారణమవుతోంది. దుకాణాల వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని మురుగు కాలువల్లో వేస్తున్నప్పటికీ బల్దియా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

సమీక్షలే ముఖ్యం.. సమస్యలపై నిర్లక్ష్యం

ఈటీవీ-ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాధులతో అల్లాడుతోంది. ఊరు, వాడా తేడా లేకుండా జ్వరాలు, కీళ్ల, ఒళ్లు నొప్పులతో జనం కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. వైద్యారోగ్య, బల్దియా, పంచాయతీ, డీఆర్‌డీఏ శాఖల సమన్వయ లోపంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత కనిపించడం లేదు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల విధి నిర్వహణపై దృష్టిసారిస్తున్న ఉన్నతాధికారులు జిల్లా అధికారుల పనితీరును పరిగణనలోకి తీసుకోకపోవటంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరి 2న జడ్పీ, మండల, పంచాయతీల పాలన ముగియటంతో ప్రత్యేక అధికారుల పాలన అందుబాటులోకి వచ్చింది. పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమితులైన అధికారులు ఇచ్చే నివేదికలపై సమీక్షలు చేయడమే తప్పితే క్షేత్రస్థాయిలోని సమస్యలను ఉన్నతాధికారులు దృష్టి సారించటం లేదు. పల్లె, పట్టణాల్లో ఫాగింగ్, బ్లీచింగ్, దోమల నివారణ మందుల పిచికారీ చేయడం లేదు. శుభ్రం చేయని మురుగు కాలువలు రోగాలు ప్రబలడానికి కారణమవుతున్నాయి. తాగునీటి వసతుల క్లోరినేషన్ జరగడం లేదు. వాటికి కేటాయిస్తున్న నిధుల లెక్క తేలడం లేదు.

☛ బేల మండలం గణేష్‌పూర్‌లోని పల్లె క్రీడా ప్రాంగణం దస్త్రాల్లో చూపించుకోవడానికి తప్పితే అక్కడ దేనికీ ఉపయోగపడటం లేదు. పిచ్చిగడ్డి పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది.

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	మున్సిపాలిటీలు
ఆదిలాబాద్	17	473	01
నిర్మల్	18	400	03
ఆసిఫాబాద్	15	335	01
మంచిర్యాల	16	311	07



ప్రబలుతున్న రోగాలు : జ్వరంతో బాధపడుతున్న వీరు తిర్యాణి మండలం చింతపెల్లికి చెందిన అత్తా కోడళ్లు చేదం పోశక్క, లక్ష్మి. నెలరోజులుగా కీళ్ల, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తిర్యాణి, మంచిర్యాలలో చూపించుకున్నా నొప్పులు తగ్గటం లేదు. తిర్యాణి సహా పెరకపల్లి, తెలండీ, రాళ్లకన్నెపల్లి, గంభీరావుపేట, చెల్మెల, నాయకపుగూడలో ఇదే దయనీయ పరిస్థితి ఉంది.

నిర్మల్ బొమ్మకు జాతీయ ఖ్యాతి

● పర్యాటక దినోత్సవం సందర్భంగా వరించిన అవార్డు



ఇచ్చిన అవార్డు



కళాకారులు చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు

నిర్మల్, న్యూస్‌టుడే: కళకు మహత్తరమైన శక్తి ఉంటుంది. అచేతనంగా భావించే అనేక వస్తువులపై కళాకారుల చూపు పడగానే చేతనత్వంగా మారుతున్నాయి. వారి కర స్పర్శతో అవి పులకితమై అపూర్వ కళాఖండాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అటు తేలికపాటిగా ఉండే పొనికి కర్రతో బొమ్మలు తయారుచేస్తూ ఇటు ప్రకృతి రంగులతో చిత్రాలు గీస్తూ నిర్మల్‌కు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తున్నారు.. ఇక్కడి కళాకారులు. 400 ఏళ్ల నుంచి బొమ్మలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తూ ఆ 'కళ'ను బతికిస్తున్నారు. సజీవంగా కళ్లకు కట్టినట్లు కనిపించే ఈ బొమ్మలతో నిర్మల్‌కు ఎన్నోసార్లు గుర్తింపు వచ్చిన విషయం తెలిసిందే. పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గత నెల 27న దిల్లీలో జరిగిన కార్యక్రమంలో హస్తకళ విభాగంలో కొయ్య బొమ్మలకు నిలయమైన నిర్మల్‌ను 'ఉత్తమ పర్యాటక గ్రామం' అవార్డు వరించింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతుల మీదుగా జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, కొయ్య బొమ్మల పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పెంటయ్య ఈ అవార్డును అందుకున్నారు.

40 కుటుంబాలు..

నాలుగు శతాబ్దాల క్రితం నిర్మల్‌ను పాలించిన నిమ్మనాయుడు తన వెంట కళాకారులను తీసుకొచ్చి ఇక్కడ స్థిరనివాసం కల్పించారు. అప్పటి నుంచి దాదాపు 40 కుటుంబాలు (నగిశి) కళను నమ్ముకొని జీవిస్తున్నాయి. అయిదారు తరాల నుంచి ఇక్కడి కళాకారులు బొమ్మలు తయారుచేస్తున్నారు. బొమ్మల తయారీ వెనుక మహిళల హస్తకళ దాగి ఉంది. ఇళ్లల్లో మహిళా కళాకారుల చేతిలో ఆకులో ఆకై, బొమ్మలో బొమ్మై, కొమ్మలో కొమ్మై, పువ్వులో పువ్వై జీవకళ సంతరించుకుంటుంది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ బొమ్మల తయారీలో మహిళా కళాకారులు తమ నైపుణ్యాన్ని చూపుతున్నారు. వివిధ జంతువులు, పక్షులు, పిచ్చుకలు, నెమళ్లు, పోపుల పెట్టె, పులులు, సింహాలు, నోరూరించే పండ్ల నమూనాలు, ఇలా ఇంకెన్నో బొమ్మలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. సహజత్వం, సమ్మోహనం ఇక్కడి కళాకారుల ప్రత్యేకత.

డిమాండ్ బాగుంది..

నిర్మల్ కొయ్యబొమ్మలు రాష్ట్రంతో పాటు దేశంలో పలు రాష్ట్రాలు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్ లేపాక్షికి పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఈ బొమ్మను ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం కర్రతో ఆకట్టుకునేలా బొమ్మలే ఉపయోగపడేలా తయారు చేస్తుండటంతో మంచి డిమాండ్ పెరిగింది. రోజుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల విలువ గల బొమ్మలు విక్రయిస్తున్నారు. అమెరికా, ఇంగ్లాండ్ దేశాలతో పాటు ఇతర దేశాలకు పంపిస్తున్నారు.

డీసెట్ ధ్రువపత్రాల పరిశీలన



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎడ్ ప్రవేశాల కోసం డీసెట్ రాసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో మంగళవారం సజావుగా జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల నుంచి 36 మంది అభ్యర్థులు తరలి వచ్చారు. తమ ధ్రువపత్రాలను సమర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.కోల కిరణ్, సూపరింటెండెంట్ భోజన్న తదితరులు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వెబ్ ఆప్షన్లు ఆన్‌లైన్‌లో పెట్టుకుని సీటు అలాట్‌మెంటు తర్వాత కేటాయించిన కళాశాలలో రిపోర్టు చేయాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు బాసర ముస్తాబు



భక్తుల కోసం ఏర్పాటుచేస్తున్న క్యూలైన్లు

ముథోల్ (బాసర), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు బాసర అమ్మవారి ఆలయం ముస్తాబు అవుతోంది. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయాధికారులు చెప్పారు. దసరా సందర్భంగా ఆలయంలో అభిషేకాలు ఉండవు. కేవలం పూజలు మాత్రమే నిర్వహిస్తారు. అభిషేకం, కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల్లో రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం చేస్తారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయిస్తారు.

సవాలు విసురుతున్న పర్యావరణ పరిరక్షణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: శాస్త్ర, సాంకేతిక రంగాలు పురోగతి సాధిస్తున్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ సవాలుగానే మిగిలిందని బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ పేర్కొన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్జీయూకేటీలో మంగళవారం బయోసైన్స్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్థిక సహకారంతో పర్యావరణ పరిరక్షణపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ, పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విశ్వవిద్యాలయం అధ్యాపకులు పాల్గొని ప్రసంగించారు. పర్యావరణ కాలుష్యం వల్ల కల్గే నష్టాలు, గాలి, నీరు భూమిపై కాలుష్యం తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ కాశీనాథ్, ఓయూ ఖగోళశాస్త్ర విభాగం అధ్యాపకుడు డా.మహేందర్, ఐఐటీ పుణే అధ్యాపకురాలు డా.ప్రితాంజలిషిండే తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్ సఫారీకి వేళాయే

● మూడు నెలల అనంతరం నేడు ప్రారంభం

జన్నారం, న్యూస్‌టుడే:

కవ్వాల్ అందాలు ఎప్పుడెప్పుడు తిలకిద్దామా అని ఎదురుచూస్తున్న పర్యాటకులకు ఆ రోజు రానే వచ్చింది. దట్టమైన అడవి మధ్యలో చెంగున ఎగిరే జింకలు, పురివిప్పి నర్తించే మయూరాలు, కాజ్‌వేల నుంచి జాలువారే జలపాతంలాంటి నీటి వయ్యారాలను చూసి మురిసిపోవడానికి మరికొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. జులై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలలపాటు సఫారీ వాహనాల రాకపోకలను నిషేధించిన అటవీశాఖ బుధవారం నుంచి వాటిని పునఃప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వర్షాలు అధికంగా కురవడం, అడవిలో నివసించే అన్ని రకాల జంతువుల కలయికకు అనువైన సమయంగా భావించి ప్రతీ ఏడాది మూడు నెలలపాటు అడవిలోకి వెళ్లడానికి ఎలాంటి అనుమతులు ఉండవు.

ఎంత చెల్లించాలంటే..



బైసన్‌కుంట వద్ద సఫారీ వాహనం ఎక్కుతున్న పర్యాటకులు

జంగిల్ సఫారీలో రెండు గంటలపాటు అన్నీ మరిచిపోయి అడవిలో తిరిగి రావడానికి శని, ఆదివారం ఒక్కో వాహనానికి రూ.4 వేలు తీసుకుంటారు. మిగిలిన రోజుల్లో రూ.3,500 వసూలు చేస్తారు. ఒక్కో వాహనంలో ఆరుగురు ప్రయాణించాలనే నిబంధన ఉంది. ఒకవేళ అదనంగా ఒకరు లేదా ఇద్దరు వెళ్లాలంటే మాత్రం ఒక్కొక్క వ్యక్తికి రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అటవీశాఖ ఆధ్వర్యంలో నాలుగు కొత్తవి, ఒక పాత వాహనం నడుస్తున్నాయి. ఉదయం 6.30 గంటలకు అడవిలోకి వెళ్లే వాహనం 8.30 వరకు తిరుగు పయనం అవుతోంది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు వెళ్లే వాహనం సాయంత్రం 5.30 గంటల వరకు అడవిలో ప్రయాణం పూర్తి చేసుకుంటుంది. ప్రతి రోజు మూడు ట్రిప్పులు వెళ్లే వాహనాలకు మంగళవారం మాత్రం సెలవు.

ఎక్కడెక్కడ తిప్పుతారంటే..

సఫారీ వాహనాన్ని ఆన్‌లైన్‌లోగానీ నేరుగా గాని బుక్ చేసుకోవచ్చు. వాహనంలో ఎక్కిన పర్యాటకులను వెల్ కం కవ్వాల్ టైగర్ జోన్ బోర్డు వద్ద నుంచి గోండుగూడ బేస్‌క్యాంపు, నీలుగాయికుంట, బైసన్‌కుంట వరకు తీసుకెళ్తారు. ఆయా కుంటల వద్ద ఫొటోలు దిగడానికి, కొద్దిసేపు సేద తీరడానికి అవకాశం కల్పిస్తారు. తిరిగి కడెం ప్రధాన కాలువగుండా మైసిపెల్లి బీట్ నుంచి హనుమాన్ మందిరం వరకు వెళ్లి ప్రధాన రహదారి చేరుకుంటారు. ప్రయాణంలో ఎన్నెన్నో మూగజీవాలు తారసపడుతుంటాయి. ఇక్కడ చుక్కల దుప్పుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అడుగడుగునా అవి కనిపించి కనువిందు చేస్తాయి. వన్యప్రాణులు, పక్షులను చూసే అవకాశాలు ఉన్నాయి. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండు పాత సఫారీ వాహనాలు ఉన్నాయి. శని, ఆదివారాల్లో రూ.2 వేలు, మిగిలిన రోజుల్లో రూ.1,500 వసూలు చేస్తారు. అడవి అందాలను చూపించేందుకు జంగిల్ సఫారీ వాహనాలు సిద్ధంగా ఉన్నాయి. మరి అడవిలో పయనించేందుకు మీరు సిద్ధమేనా...!



నీలుగాయి కుంట వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఆకట్టుకున్న ఆహార పండగ

కుంటాల, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆహార పండగ (ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసిన వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని ఆరోగ్యకరమైన వంటకాలనే తినాలని సూచించారు. చక్కటి రుచులు, కొత్త వంటకాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రామానికి చెందిన మిట్టపల్లి సాయినాథ్ రూ.4,500 విలువైన మైక్‌సెట్ విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు నవీన్, పద్మలత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

తీవ్ర జ్వరంతో మహిళ మృతి



శంకరమ్మ

ఖానాపూర్, న్యూస్‌టుడే: తీవ్ర జ్వరంతో మహిళ మృతి చెందిన ఘటన ఖానాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన డి.శంకరమ్మ(40)కు జ్వరం రావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. కాగా రక్తపరీక్షలు చేయించగా రక్తకణాలు తక్కువ అయినట్లు రిపోర్టులు రావడంతో అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. జ్వరం తగ్గుముఖం పట్టకపోగా, రక్తకణాల సంఖ్య ఇంకా పడిపోయాయి. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు సోమవారం రాత్రి నిర్మల్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు.

దసరా సెలవులు.. స్వస్థలాలకు విద్యార్థులు..





నిర్మల్ అర్బన్ : ఇళ్లకు బయల్దేరి వెళ్తున్న విద్యార్థినులు

దసరా సెలవులు బుధవారం నుంచి ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లోని వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు, పోషకులతో కలిసి ఇళ్లకు మంగళవారం బయల్దేరి వెళ్లారు. పట్టణంలోని ఆయా చోట్ల పిల్లలతో సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్, దస్తూరాబాద్



దస్తూరాబాద్ కేజీబీవీ నుంచి విద్యార్థినులను ఆటోలో తీసుకెళ్తున్న తల్లిదండ్రులు